సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 17 । అక్టోబర్ । 2024



వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం
సీలేరు ప్రధాన వీధి మండపం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు. నిమజ్జనం వైభవంగా జరిగింది.

8లో



27 నుంచి పవిత్రోత్సవాలు
పద్మనాభం కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి 30 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

8లో



ఎరుకుమాంబకు జలాభిషేకం
విశాఖ: దొండపర్తిలో శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు.

న్యూస్‌రీల్

సంప్రదాయ పంటలపై ప్రత్యేకదృష్టి
● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: గిరిజన రైతులంతా సంప్రదాయ పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. మండలంలోని గొండెలిలో ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈక్రాప్ నమోదును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం పంటలు ఎరువులు లేకుండానే పండిస్తున్నందున దిగుబడులకు మంచి డిమాండ్ ఉందన్నారు.అరకు కాఫీ,మిరియాల పంటలు కూడా అంతర్జాతీయంగా ఖ్యాతి ఆర్జించాయన్నారు. గిరిజన రైతులంతా అధిక ఆదాయం ఆర్జించే విధంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అంతకు ముందు గొండెలి, ఇరడాపల్లి పంచాయతీ లాడాపుట్టు గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, ఎంపీపీ, జెడ్పీటీసీ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన
● పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం 11మండలాల ఏటీడబ్ల్యూవోలు, మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉన్నత స్థాయికి ఎదగడంలో కెరీర్ గైడెన్స్ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదివితేనే ఉన్నతస్థాయికి చేరుతారన్నారు. ఇన్‌చార్జి డీడీ రజని, పాల్గొన్నారు.

రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కాఫీ గింజల కొనుగోలు
● జీసీసీ డీఎం సింహాచలం



మత్స్యపురంలో మాట్లాడుతున్న జీసీసీ డీఎం సింహాచలం

ముంచంగిపుట్టు: గిరిజన సహకార సంస్థ ద్వారా రైతుల ఇంటి వద్దకు వెళ్లి కాఫీ గింజలను కొనుగోలు చేస్తామని పాడేరు జీసీసీ డీఎం సింహాచలం అన్నారు. మండలంలోని బాబుశాల పంచాయితీ మత్స్యపురంలో బుధవారం కాఫీ రైతులకు కాఫీ కొనుగోళ్లు, నాణ్యతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు సేకరించిన కాఫీని జీసీసీకి విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల వ్యక్తిగత ఖాతాలో నగదు జమ అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాఫీ సబ్ అసిస్టెంట్ శ్రీరాములు, కాఫీ సేల్స్‌మెన్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచరియల విధ్వంసానికి గురైన చత్రాపల్లి బాధితులకు ప్రభుత్వం నుంచి ఆసరా కరువైంది. గతనెల 8వ తేదీన సంభవించిన ప్రకృతి విలయతాండవానికి గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీలో గల ఈ గ్రామం నామరూపాలు లేకుండా పోయింది. ఈ ఘోర విపత్తులో గిరిజన మహిళ ప్రాణాలు కోల్పోయింది. బాధితుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమచేసిన ప్రభుత్వం 40 రోజులు గడుస్తున్నా వారిని పూర్తిస్థాయిలో అదుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గుడారంలో తలదాచుకుంటున్న కొర్రా రామన్న, బాలరాజు కుటుంబాలు

జీవనం దుర్భరం

కొండచరియల విధ్వంస ఘటన నుంచి తేరుకోని చత్రాపల్లి

- రూ.10 వేలకే పరిమితమైన ప్రభుత్వ సాయం
- 40 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో ఆదుకోని రాష్ట్ర ప్రభుత్వం
- గుడారాల్లో తలదాచుకుంటున్న బాధిత కుటుంబాలు



ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన రేకులతో ఏర్పాటుచేసిన షెడ్డులో ఉంటున్న గెమ్మెలి కృష్ణ ప్రసాద్ కుటుంబం

సాక్షి,పాడేరు: గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామస్తులు బిక్కుబిక్కుమని జీవనం సాగిస్తున్నారు. కొండ దిగువున ఈ గ్రామం ఉన్నందున వర్షం కురిసినప్పుడల్లా ఎప్పుడు ఏ ఆపద సంభవిస్తోందన్న భయం గ్రామ గిరిజనులను వెంటాడుతోంది. గతనెలలో ఈ గ్రామంపై కొండచరియలు విరుచుకుపడటంతో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. ముగ్గురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అధికారయంత్రాంగం బాధిత కుటుంబాలను సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు తరలించి తాత్కాలిక పునరావాసం కల్పించారు. గ్రామ గిరిజనులను అన్నివిధాలుగా ఆదుకుంటామని, ఇళ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, అధికారులు హామీ ఇచ్చారు. ఇదంతా జరిగి దాదాపుగా 40 రోజులు గడుస్తున్నా ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు కానరావడం లేదు. దీంతో ఆరు బాధిత కుటుంబాలు సప్పర్ల నుంచి చత్రాపల్లి గ్రామానికి వచ్చేశాయి. ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లతో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నాయి.

- తండ్రీ కొడుకులైన కొర్రా రామన్న, కొర్రా బాలరాజు వేర్వేరుగా జీవిస్తున్నారు.అయితే వారి రెండు ఇళ్లు కొండచరియల విధ్వంసానికి కొట్టుకుపోయాయి.
- గెమ్మెలి చంద్రరావు,కృష్ణప్రసాద్ కుటుంబాలు ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన రేకులతో తాత్కాలికంగా షెడ్డు నిర్మించుకున్నారు.
- గెమ్మెలి శ్రీను, గెమ్మెలి పండన్న కూడా ఇళ్లు కోల్పోవడంతో ఆ కుటుంబాలు పరాయి పంచన జీవనం సాగిస్తున్నాయి.

40 ఇళ్లతో మోడల్ కాలనీ



చత్రాపల్లి గ్రామ గిరిజన కుటుంబాలకు సురక్షిత ప్రాంతంలో మోడల్ కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎంజన్‌మన్ పథకంలో గృహాలకు ప్రస్తుతం సర్వే చేస్తున్నాం.40 ఇళ్లతో అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీకి స్థల పరిశీలన చేస్తున్నాం. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇళ్లు కోల్పోయిన ఆరు కుటుంబాలకు తాత్కాలిక సాయం కింద సిమెంట్ రేకులను పంపిణీ చేయాలని ఐటీడీఏ పీవోకు ఆదేశాలు ఇస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

గుడారంలో ఉంటున్నాం



నాతో పాటు నా కొడుకు ఇళ్లు వరదలో కొట్టుకుపోయింది.రెండు ఇళ్లు పాగొట్టుకుని కట్టుబట్టలతో మిగిలాం. గ్రామంలోనే తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాం. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. అధికారులు ఇచ్చిన హామీని మరచి పోవడం అన్యాయం.

– కొర్రా రామన్న, వరద బాధితుడు, చత్రాపల్లి

పక్కా ఇళ్లు నిర్మించాలి



ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోతే బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10వేల మాత్రమే నష్ట పరిహారం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం గూడు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.పక్కా గృహాలు నిర్మించి అందజేసే బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

– గెమ్మెలి చంద్రరావు, వరద బాధితుడు, చత్రాపల్లి

ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్
● కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఇక నుంచి ప్రతినెల 3వ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 18వతేదీ సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. అలాగే అదేరోజు ఉదయం మీకోసం సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆశ్రమ ఉపాధ్యాయిని సస్పెన్షన్

రంపచోడవరం: అడ్డతీగల గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణవేణిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి తెలిపారు. చెక్‌బౌన్స్ కేసులో అరెస్టు అయి బెయిల్‌పై విడుదల అయిన నేపథ్యంలో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో ఈనెల 18వతేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుదని విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాడేరు మండలం వంట్లమామిడి ఫీడర్ పరిధిలోని వంట్లమామిడి, కోట్లగరువు, కందమామిడి, బంగారుమెట్ట, పెదబయలు మండలంలోని రూడకోట, గోమంగి, కుమడ, జామిగుడ, అనంతగిరి మండలంలోని భీసుపురం, మరదగుడ, లక్ష్మీపురం, దిగువశోభ, చిలకలగెడ్డ, కాశీపట్నం, ఎస్ఆర్‌పురం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

పులి సంచారంతో భయాందోళన

- మూడవరోజు పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు
- అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- దండోరా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసిన సిబ్బంది



బోదునూరులో దండోరా వేయిస్తున్న అధికారులు




పులి జాడ కోసం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

కూనవరం: స్థానిక అటవీ రేంజ్ పరిధిలోని రిజర్వు ఫారెస్ట్‌లో గత మూడు రోజుల నుంచి పెద్దపులి పాదముద్రలు లభ్యమవుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటి వరకు ఎటువంటి దాడులకు పాల్పడకపోయినా ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయానికి గురవుతున్నారు. సోమవారం చింతూరు మండలం తాటిలంక ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు గుర్తించగా, రెండవ రోజు కూనవరం మండలం దూగుట్ట గ్రామంలో పులి అడుగు జాడలు గుర్తించారు. మండల పరిధిలోని పాలగూడెం, బోదునూరు మధ్యలో బుధవారం పులి అడుగుజాడలు గుర్తించామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. పులి సంచరిస్తున్న సమాచారం పక్కాగా నిర్ధారణ కావడంతో అటవీప్రాంతంలో 20 ట్రాప్ కెమారాలను సిబ్బంది ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న బోదునూరు, పాలగూడెం, మెట్టరామవరం, దూగుట్ట, కూళ్లపాడు, నర్సింగపేట, కాచవరం, గుండువారి గూడెం, రామచంద్రాపురం, తాటిలంక తదితర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్, రెవెన్యూ సిబ్బంది దండోరా వేయించారు. మూడు చోట్ల లభ్యమైన పులి పాద ముద్రలు ఒకదానికి చెందినవని నిర్ధారణకు వచ్చినట్టు ఎఫ్ఆర్ కరుణాకర్ తెలిపారు. ఈ ప్రాంతంలో సంచరించే పులి వయసు 16 సంవత్సరాలకు పైగా ఉండవచ్చన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ లతశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు అరకు క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక

అరకులోయ రూరల్: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలకు అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు శిధర్‌రెడ్డి, సాన్వితేజ, యశ్వత్‌తేజలు ఎంపిక అయిన్నట్లు కోచ్ రాజబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగే జూనియర్ విభాగం అండర్14 బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కోచ్ రాజాబాబు

600 టన్నుల పాచ్‌మెంట్ కాఫీ కొనుగోలు లక్ష్యం
● కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈ ఏడాది జీసీసీ, పాడేరు ఐటీడీఏ సంయుక్తంగా 600 టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజలను సేకరణకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జీసీసీ,వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన, ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు పండించే కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో తగిన గుర్తింపు ఉందన్నారు. నాణ్యమైన కాఫీ గింజల సేకరణ ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఈ మేరకు గిరిజన రైతులు ఏడు సార్లు కాఫీ పండ్లు సేకరించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే కాకుండా సెర్ప్ మాదిరిగానే కాఫీ రైతులతో ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాఫీగింజలను నిల్వ చేసేందుకు అవసరమైన గిడ్డంగులను గుర్తించాలని, చింతపల్లి కేంద్రంలో కాఫీ గింజల వేలంకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జీసీసీ ఎండీ కల్పనాకుమారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, కాఫీ ఏడీ అశోక్, డీడీ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నందు, మార్కెటింగ్‌శాఖ ఏడీ రాకేష్, జీసీసీ పాడేరు, చింతపల్లి డీఎంలు సింహాచలం, దేవరాజ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

జారుకున్న నిర్వాహకులు

సాక్షి,పాడేరు: స్థానిక పాతబస్టాండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్‌లో మద్యం దుకాణం ఏర్పాటును బుధవారం రాత్రి మహిళలు అడ్డుకున్నారు. జీసీసీ డిపో, పోస్టాఫీస్‌తో పాటు నివాసాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు తగదంటూ వారు ఆందోళనకు దిగారు. నిర్వాహకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో దుకాణం తెరవడానికి వచ్చిన వారంతా అక్కడ నుంచి జారుకున్నారు. ఈ ప్రాంతీయులు గతంలో కూడా ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటును వీరు వ్యతిరేకించారు. అప్పటి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని పాతబస్టాండ్ మహిళలు కోరడంతో అధికారులు వారి విజ్ఞప్తిని గౌరవించారు. దీంతో మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా మద్యం దుకాణం వేరే ప్రాంతంలో ఏర్పాటుచేసే వరకు ఆందోళన విరమించేది లేదని పాత బస్టాండ్ మహిళలు స్పష్టం చేశారు.



పాత బస్టాండ్ వద్ద అడ్డుకుంటున్న మహిళలు

కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జాతీయ ప్రతినిధి పాలికి లక్కు డిమాండ్


సాక్షి,పాడేరు: అరకు ఆర్గానిక్ కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా అధిక ధర ఉన్న నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మన్యం కాఫీ గింజలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కాఫీ రైతు సంఘం జాతీయ ప్రతినిధి పాలికి లక్కు డిమాండ్ చేశారు. బుధవారం కాఫీ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జీసీసీ కాఫీ ఎపెక్స్ కమిటీ 2024–25కు సంబంధించి ప్రకటించిన గిట్టుబాటు ధరలను వ్యతిరేకిస్తున్నామన్నారు. పార్చిమెంట్ కాఫీని కిలో రూ.285, చెర్రి రకాన్ని కిలో రూ.150, రొబస్టా చెర్రీని రూ.80తో కొనుగోలు ధరలను జీసీసీ ప్రకటించడం అన్యా యమన్నారు. గిరిజనులు ఉత్పత్తి చేసే కాఫీ గింజలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పార్చిమెంట్ కిలో రూ.500, చెర్రీ కిలో రూ.300, రొబస్టా చెర్రీ కిలో రూ.200 చొప్పున జీసీసీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ 2008 నుంచి కాఫీ రైతుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గిరిజన కాఫీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.బొజ్జన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ప్రతినిధి పాలికి లక్కు

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి

స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ): ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జల వనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నప్పటికి కొత్త గృహాలు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం కూడా జరుగుతుందని అధికారులు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్పీటీసీలకు సమాచారం ఇవ్వాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లేవనెత్తిన ప్రశ్నకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన దాదాపు 95 శాతం వరకు పింఛన్లు పంపిణీ జరుగుతోందని, అందుబాటులో లేని వారికి మరుసటి రోజున అందజేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వండి

గ్రామాల్లో రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో నారాయణమూర్తి కోరారు. మండల స్థాయిలో రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు, జిల్లా స్థాయిలో రోడ్ల కోసం జెడ్పీ నిధుల నుంచి ఖర్చు చేస్తామన్నారు. కోరం లేని కారణంగా నాల్గవ స్థాయీ సంఘం సమావేశం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

సరిహద్దు వంతెన ఇలా.. రాకపోకలు ఎలా?



ఇరు రాష్ట్రాల సరిహద్దులో పూర్తిగా దెబ్బతిన్న ఐరన్ వంతెన



కోతకు గురైన ప్రాంతంలో మొక్కుబడిగా చేపట్టిన మరమ్మతులు

సరిహద్దు సమస్యపై దృష్టి పెట్టని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలను కలిపే సరిహద్దు ఐరెన్ వంతెనపై భయం భయంగా రాకపోకలు సాగుతున్నాయి. అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేపట్టి వదిలేయడంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో జోలాపుట్టు జలాశయ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకోవడంతో జలాశయం నుంచి 50 వేల క్యూసెక్కుల నీటిని ఒకేసారి విడుదల చేశారు. దీంతో ప్రవాహ ఉధృతికి ఐరన్ వంతెన ముందు భాగం పూర్తిగా కొట్టుకుపోవడం తెలిసిందే. దీంతో ప్రభుత్వ అధికారులు అప్పటికప్పుడు కొట్టుకుపోయిన ప్రాంతంలో మట్టి, రాళ్లతో పూడ్చివేశారు. రాకపోకలు పునరుద్ధరించారు. దెబ్బతిన్న ఐరన్ వంతెన మరమ్మతులపై దృష్టి పెట్టలేదు. పైభాగంలో రంధ్రం ఏర్పడింది. సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో జోలాపుట్టు జలాశయ డ్యామ్ పైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల ప్రాజెక్ట్‌కు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఐరన్ వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని జోలాపుట్టు ఆర్ఎఫ్,ఎల్ఎఫ్ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం : డొంకరాయి పోలీసు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి. ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ నుంచి ముగ్గురు వ్యక్తులు ఒక బైక్‌పై మూడు కేజీల గంజాయి రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. లక్కవరం ఫారెస్టు రేంజ్ అధికారి జి.వి.నానాజీ సమక్షంలో తనిఖీ చేసి విచారణ చేయగా పట్టుబడిన నిందితులు ఒడిశా రాష్ట్రానికి చెందిన బీమా కడ, త్రినాథ్ కడ, ఇంతులూరు వాగుకి చెందిన కిలో పరమేష్‌గా గుర్తించినట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎస్‌ఐ సురేష్ బుధవారం సందర్శించి, విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మత్తు పదార్థాల అనర్థాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనువాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ నాయుడు, సిబ్బంది కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రానికి అనాథ చిన్నారుల తరలింపు

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామంలో ఆదివారం జరిగిన హత్య ఘటనలో అనాథులుగా మిగిలిన శ్రావణి,బాబు పవన్‌లను ప్రభుత్వ బాలల సంరక్షణ గృహానికి తరలిస్తున్నట్టు సీడీపీవో బాలచంద్రమణి దేవి చెప్పారు. ఆమె సోమవారం గన్నేరుపుట్టు గ్రామాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో సర్పంచ్, గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భర్త మనో చేతిలో భార్య లబ్బ మృతి చెందడంతో వారి పిల్లలు శ్రావణి, పవన్‌లు అనాథులుగా మిగిలిరన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని ప్రభుత్వ బాలల సంరక్షణ గృహానికి తరలిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ మఠం శాంతికుమారి, వార్డు సభ్యుడు మత్స్య కొండబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



సమావేశంలో పాల్గొన్న హోటళ్లు, లాడ్జీ, రెస్టారెంట్ల నిర్వాహకులు

- ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలి
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పర్యాటక కేంద్రాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అందరూ సమష్టిగా కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, లాడ్జి, హోటళ్ల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో ప్రతి ఒక్క వ్యాపారి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రధానంగా లాడ్జీలు, హోటళ్ల యజమానులందరూ ధరల పట్టికను ఏర్పాటుచేయాలన్నారు. స్థానికులే టెంట్లు ఏర్పాటుచేయాలని ఇందుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. మైదాన ప్రాంతాల నుంచి గిరిజనేతర వ్యాపారులు వచ్చి ఇక్కడ అనధికారికంగా టెంట్లు వేసి అక్రమంగా అధిక ధరలకు అద్దెకు ఇస్తున్నట్టు ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. వీటిపై ఎంపీడీవోలు, తహసీల్దారుల ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతగిరి మండలం చిలకలగెడ్డ నుంచి డుంబ్రిగుడ వరకు పర్యాటకుల సందర్శిత ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. లాడ్జిల్లో కూడా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు నిషేధించాలన్నారు. గాజు గ్లాస్‌లు, పర్యావరణానికి ముప్పులేని వస్తువులనే వినియోగించాలని సూచించారు. పంట పొలాలు, వ్యవసాయ క్షేత్రల్లో మద్యం బాటిళ్ల పగలగొట్టి వదిలేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

మండల కేంద్రంలో ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో అదనంగా దుకాణాలు ఏర్పాటు చేయకూడదన్నారు. షాపు ఎదురుగా రహదారిపై టెంట్లు,లేదా కుర్చీలు, వివిధ సామగ్రి ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఏపీవో జనరల్ వి.ఎస్. ప్రభాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, డివిజనల్ పంచాయితీ అధికారి పిఎస్ కుమార్, ఎంపీడీవోలు కుమార్, లవరాజు, సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాల్‌రావు పాల్గొన్నారు.

పీఎం జనమన్ గృహ నిర్మాణాలు వేగవంతం

గృహ నిర్మాణశాఖ పీడీ బాబునాయక్



పీవీటీజీల గృహాల శంకుస్థాపన కార్యక్రమంలో పీడీ బాబునాయక్

డుంబ్రిగుడ: పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని గృహ నిర్మాణశాఖ పీడీ బాబునాయక్ తెలిపారు.బుధవారం అంత్రిగుడ పీవీటీజీ గ్రామాన్ని సందర్శించిన ఆయన పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ పథకంపై పీవీటీజీలకు అవగాహన కల్పించారు. అనంతరం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 730 గృహలు మంజూరు కాగా మొదటి విడతలో 432 నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. రెండో విడతలో 70, మూడో విడతలో 9 చొప్పున నిర్మాణాలు చేపట్టినట్టు ఆయన వివరించారు. పేద గిరిజనుల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని, ఒక గృహానికి రూ2.39 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. నిర్మాణాలు చేపట్టిన వారం రోజుల్లోనే బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఇల్లు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు గృహ నిర్మాణాలు ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ జి. నాగేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డుడుమ వద్ద పర్యాటకుల జీపు బోల్తా

నలుగురికి తీవ్ర గాయాలు



ఒనకఢిల్లీలో తీవ్ర గాయాలైన ఎర్రబుడ్డికి వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు : ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతం సమీపంలో పర్యాటకుల జీపు బోల్తా పడింది. నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ వెదురుగుప్ప గ్రామానికి చెందిన గిరిజనులు డుడుమా జలపాతం చేసేందుకు బుధవారం ఉదయం బయలుదేరారు. ముందుగా జోలాపుట్టు జలాశయం చూసి అక్కడి నుంచి డుడుమ జలపాతం వద్దకు వెళ్తుండగా బురుడాయిల్ మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న జీపు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో జీపులోని 12 మంది చెల్లాచేదురుగా పడిపోయారు. ఆ సమయంలో అర్లాబు ఎర్రబుడ్డి అనే వృద్ధురాలు జీపు కింద ఉండిపోయింది. వెళ్తున్న వాహనదారులు, స్థానికుల సహాయంతో ఎర్రబుడ్డిని అతి కష్టం మీద బయటకు తీశారు. ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రులను ఒడిశాలోని ఒనేకఢిల్లి ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. కొత్తిమీర శంకరరావు, అర్లాబు బాలంనాయుడు, అర్లాబు లావణ్య, ఎర్రబుడ్డిలకు కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రాజెక్టు వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. మిగిలిన 8 మందికి స్వల్పగాయాలు అయ్యాయి. పరిస్థితి విషయంగా ఉన్న వృద్ధురాలు ఎర్రబుడ్డిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఆంధ్రలోని లబ్బూరు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి ముంచంగిపుట్టులోని సీహెచ్‌సీకి తరలించారు. స్థానిక వైద్యాధికారి గీతాంజలి వైద్య సేవలు అందించారు.

నిబంధనలు పక్కాగా అమలుచేయాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోదవరం: ఏజెన్సీలోని పర్యాటక బోట్లు, రిసార్ట్స్‌ల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు పక్కా అమలు చేయాలని, నిబంధనల పరిధిలో నిర్వహణ ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. పీవో తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి పర్యాటక బోట్ ఆపరేటర్లు, రిసార్ట్స్ యాజమానులు, అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ దేవీపట్నం మండలం పోశమ్మ గండి బోట్ పాయింట్ వద్ద పాపికొండలకు వెళ్లే టూరిజమ్ బోట్లు ఉదయం 9.45కు బయలుదేరి, సాయంత్రం 5.15 నిమిషాలకు బోట్ పాయింట్‌కు చేరుకోవాలని బోటు యాజమానులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు సంబంధించి తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, సీఐలు, అటవీ రేంజ్ అధికారులతో పర్యాటకుల భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. భద్రతపై కరపత్రాలు ముద్రించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తుపాను కారణంగా ఈ నెల 17 వరకు పర్యాటక ప్రాంతాల్లో అనుమతి లేదన్నారు. పర్యాటక ప్రాంతాల్లోరి రిసార్ట్స్ పరిధిలో 500 మీటర్లు వరకు పారిశుధ్య కార్యక్రమాలను రిసార్ట్స్ యాజమాన్యం నిర్వహించాలన్నారు. ఏజెన్సీలో రిసార్ట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో రక్షణ కవచాల గురించి, హెచ్చరికలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రంపచోడవరం నుంచి మారేడుమిల్లి వరకు మధ్యలో అనేక మలుపు ఉన్నాయని, కొన్ని చోట్ల జంగిల్ క్లియరెన్స్ చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తారని, అందుకు తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లోని రహదారి వెంబడి చెత్త కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీలో పర్యాటం అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లోని జలపాతాలు వద్ద ఇనుప కంచెలు ఏర్పాటు, మరుగుదొడ్లు నిర్మాణం, వాటర్ సదుపాయం కల్పించాలని రిసార్ట్స్ యాజమాని గొర్లె అనుదీప్ తెలిపారు. వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మందకొడిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు..
నవంబర్ 6 తుది గడువు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో పూర్తి అవుతుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోనందున గత నెల 30న కొత్త నోటిఫికేషన్ జారీ చేశారు. నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించి, అదే నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేస్తారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. సాధారణంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ ఓటర్ల జాబితా నమోదులో ఉత్సాహం చూపుతాయి. ఈసారి వరుస సెలవులు, పండగలు, వర్షాల కారణంగా నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

విద్యుత్ ఉచ్చు కేసులో ముగ్గురి అరెస్ట్

మోతుగూడెం: డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో అడవి పందుల వేట కోసం విద్యుత్ కంచె ఏర్పాటు చేసి సీఆర్పీఎఫ్ జవాను మృతికి కారణమైన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. ఈనెల 6వ తేదీన డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్టగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ విధుల్లో ఉన్న తిరువాల కరాసు (55) అనే ఏపీఎస్పీ జవాను విద్యుత్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందడం తెలిసిందే. ఈ సంఘటనకు కారకులైన మెట్టగూడెం గ్రామానికి చెందిన వంతల జయదేవ్, కిలో పరశురాం, కిలో దాసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనట్లు చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే ఈ సంఘటన జరిగిన తరువాత నిందితులు నేర స్థలంలో సాక్ష్యాలను తారుమారు చేసి, తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

జిల్లాకు నిధుల కేటాయింపులో కూటమి ప్రభుత్వ విఫలం

జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు



నిధుల వివరాలను చూపిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ మొస్య

అనంతగిరి (అరకులోయ రూరల్): గిరిజనుల అంటే ఎందుకంత చులకన అని కూటమి ప్రభుత్వంపై అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ధ్వజమెత్తారు. ఆయన టోకూరు సర్పంచ్ కిల్లో మొస్యతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ గ్రామ సభల్లో కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల అధికారులు నోడల్ బృందాలతో గ్రామ సభలు ఏర్పాటు చేసి పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపించారన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు గాను 25 జిల్లాల అభివృద్ధి కోసం రూ.2712.50 కోట్లు నిధులు కేటాయించి, అల్లూరి జిల్లాను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అల్లూరి జిల్లాకు నిధులు కేటాయించడం మరచిపోయారన్నారు. ప్రతి జిల్లాలో శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క అల్లూరి జిల్లాకు మాత్రం నిధులు కేటాయించకపోవడం గిరిజనులంటే అంత చిన్నచూపు ఉందానని ధ్వజమెత్తారు. మన్యంలో 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనులకు రక్షణ లేకుండా, జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అల్లూరి జిల్లాకు నిధులు విడుదల చేయాలనిడిమాండ్ చేశారు.

విలువిద్య క్రీడాకారుల ఎంపిక ప్రారంభం



విలువిద్య క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

అరకులోయ టౌన్: స్థానిక క్రీడా పాఠశాలలో విలువిద్య అండర్ 14, 17 బాల, బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించినట్టు డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలపై క్రీడాకారులు శ్రద్ధ చూపి ఇరు రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు.ఈ ఎంపిక కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 150 మంది పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి వి.త్రినాథరావు, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, హెచ్ఎంలు కెందు, మోహన్‌రావు, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ వండలం కొండబాబు, కోచ్ సూరిబాబు, వ్యాయా మ ఉపాధ్యాయ సంఘ జిల్లా కార్యదర్శి భూపతి, చంద్రరావు పాల్గొన్నారు.

మద్యం షాపుల అనుమతులు రద్దు చేయాలని వినతి



రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రాన్ని అందజేస్తున్న లచ్చిరెడ్డి



తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘం నేతలు

రంపచోదవరం: ఏజెన్సీలో పంచాయతీరాజ్ చట్టం (పీసా) నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. షాపులు ఏర్పాటుకు గ్రామసభల తీర్మానం అవసరం ఉన్నందున పీసా చట్టంలోని నిబంధనలు పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లాటరీల ద్వారా జారీ చేసిన మద్యం లైసెన్సులను రద్దు చేసి పీసా చట్ట ప్రకారం గిరిజన ప్రాంత హక్కులను కాపాడాలని కోరారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మద్యం షాపును గుడికి, బడికి దూరంగా ఏర్పాటు చేయాలని గిరిజన మహిళ సంఘం అధ్యక్షురాలు ఎస్.ఈశ్వరి, కార్యదర్శి ఎస్.విజయలు అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద బుధవారం మద్యం షాపు ఏర్పాటుకు చేస్తున్న విషయం తెలుసుకున్న గిరిజన మహిళ సంఘం మహిళలు స్థానిక తహసీల్దార్ నర్సమ్మను కలిసి గుడికి దూరంగా మద్యం షాపును ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళ సంఘం అధ్యక్షకార్యదర్శులు ఈశ్వరి,విజయలు మాట్లాడుతూ గుడి, బడి పరిసరాల్లో మద్యం షాపు ఏర్పాటు సరికాదన్నారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటును నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన తహసీల్దార్ నర్సమ్మ నాలుగు రోడ్ల కూడలి ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును నిలుపుదల చేశారు. నిబంధనల ప్రకారం షాను ఏర్పాటు చేసుకోవాలని మద్యం షాపు నిర్వాహకులకు సూచించారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం



సీలేరులో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు

సీలేరు: సీలేరు ప్రధాన వీధిలో మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహ ఊరేగింపు బుధవారం వైభవంగా జరిగింది. సాయంత్రం నుంచి సీలేరు పుర వీధుల్లో థింసా నృత్యాలతో యువత, చిన్నారులు సందడి చేశారు. అనంతరం నదిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం ఆలయ మండపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం అమ్మవారి చీరను లాటరీ ద్వారా వేలం నిర్వహించారు. ఇందులో దుర్గావీధికి చెందిన భక్తుడు అజిత్ దక్కించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



తాసరుబయలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, ఎఫ్‌పీవో హనుమంతరావు



సువర్లవాడలో రైతులతో మాట్లాడుతున్న కెవీకె శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు



పనస గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సొలభం సర్పంచ్, శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐసరం హనుమంతరావు తెలిపారు. మండలంలో సొలభం పంచాయతీ తాసరుబయలు గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సామలు, రాగులు వంటి మిల్లెట్స్ ప్రకృతి సిద్ధమైన పంటలు పండించుకోవటం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా భూమి సారంవంతంగా మారుతుందని, దిగుబడులు వస్తాయని యన రైతులకు అవగాహన కల్పించారు. మండల యూనిట్ ఇన్‌చార్జి ఐ.మహేశ్వరి, వీహెచ్ఏ, ఏపీసీఎన్ఎఫ్, ఐసీఆర్పీలు రైతులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలోని సువర్లవాడ గ్రామంలో పందిరమామిడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవీకె శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పొలాలను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్టు చెప్పారు. కోళ్ల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. చేపలు, అజోల్లా పెంపకం, మేకలు పెంపకం వంటి సమగ్ర పద్ధతులపై అవగాహన కల్పించారు. కెవీకె ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ రైతులు అధిక లాభాలు పొందే అల్లం, పసుపు, చామదుంప, కూరగాయలు వంటి సాగు చేయాలని సూచించారు. హెచ్ఆర్ఎస్ అధిపతి డాక్టర్ పీసీ వెంగయ్య, ఏఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు అధిక దిగుబడి వచ్చే పంటలను పండించాలని సర్పంచ్ వి.రమేష్ అన్నారు.మండలంలో గల సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు, వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గిరిజన రైతులు కాఫీ, మిరియాలు తదితర పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు వేయడం వల్ల ఆర్థికంగా లభాలు వస్తాయన్నారు. ,ముఖ్యంగా రైతులు వ్యవసాయశాఖాధికారులు సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. సర్పంచ్ మిల్కి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, హార్టీకల్చర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్‌లు యమున, అనురాధ, కాఫీ లైజన్ వర్కర్ గోపాల్, రైతులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు రిమాండ్

హుకుంపేట : భార్యను నరికి చంపిన భర్త లఖికే ముండును పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఘటనపై సీఐ సన్యాసినాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు లఖికే ముండు తన భార్యతో కలిసి ఒడిశా నుంచి వచ్చి హుకుంపేట మండలం మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. తన భార్య గతంలో ఒడిశాలోని తమ గ్రామంలో తన బంధువు మున్నా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, దీనిపై పలు మార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో గన్నేరుపుట్టు గ్రామానికి వచ్చినట్టు నిందితుడు తెలిపాడన్నారు. ఈ నేపథ్యంలో దసరా మరుసటి రోజు లఖికేముండు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో నుంచి బయటకు వెళ్లడాన్ని గమనించి భార్యను నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో నిందితుడు మద్యం మత్తులో కత్తితో భార్య మెడపై బలంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సురేష్‌కుమార్ ఉన్నారు.

27 నుంచి పవిత్రోత్సవాలు

పద్మనాభం (విశాఖ): కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని ఈవో నానాజీ బాబు కోరారు. ఆయన మాట్లాడుతూ 27వ తేదీ సాయంత్రం పుట్టబంగారం తీసుకు రావడంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న విశేష హోమాలు, 29న స్వామికి పవిత్రాలు సమర్పించనున్నట్టు తెలిపారు. 30న పవిత్రాల విసర్జనతో పాటు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహించడంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు.